క్లుప్తంగా

గజ్జలమ్మకు వెండి కిరీటం బహూకరణ



సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుంటాల: కుంటాల ఇళవేల్పు శ్రీగజ్జలమ్మ దేవికి డాక్టర్ తోట క్రాంతికుమార్ ఆదివారం 16 తులాల వెండి కిరీటంతో పాటు ముక్కు పుడుకను బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జుట్టు సుధాకర్, ఎల్లమల శంకర్, తాటి శివ, తోట రఘు, గోపిచంద్, రాంనర్సయ్య, పి.రాములు పాల్గొన్నారు.

గజ్జలమ్మకు పూజలు

కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. గురుస్వామి జక్కని గజేందర్ అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో గజ్జలమ్మకు అభిషేకం, అలంకరణతో పాటు పల్లకిసేవలో భక్తులు పాల్గొన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్, బోకర్, ధర్మాబాద్, శివుడి, ఇస్లాపూర్ ప్రాంతాల నుంచి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

నేడు విద్యుత్ దినోత్సవం



కుంటాల: పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

కుంటాల: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా భైంసా ఎస్ఆర్ గార్డెన్‌లో సోమవారం తెలంగాణ విద్యుత్ విజ యోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఈ శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మెన్ కృపాలన్, జేఎల్ఎం విజయ్, సిబ్బంది శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

లోకేశ్వరం : భైంసా పట్టణంలో నిర్వహించే విద్యుత్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని విద్యుత్ ఏఈ శివకుమార్ ఆది వారం తెలిపారు. మండలంలోని ప్రజాప్రతి నిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

భైంసాటౌన్: విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశం ఉంటుందని, డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారులు

ఘనంగా సామూహిక వటసావిత్రి వ్రతం



వ్రతంలో పాల్గొన్న మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని వాసవిమాత ఆలయంలో ఆదివారం సామూహిక వటసావిత్రి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతంలో పాల్గొన్న మహిళలకు ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. సౌభాగ్యాన్ని ప్రసాదించే వటసావిత్రి వ్రతాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

తొలిసారి బస్సొచ్చింది..

కడెం: మండలంలోని మారుమూల అటవీ గ్రామం ఇస్లాంపూర్‌కు తొలిసారిగా ఆర్టీసీ బస్సు వెళ్లింది. నిర్మల్‌లో నిర్వహించిన సీఎం కేసీఆర్ సభకు జనసమీకరణ కోసం కవ్వాల్ మీదుగా గ్రామానికి చేరుకుంది. గ్రామస్తులను తీసుకెళ్లిన నిర్మల్ డిపో ఆర్టీసీ బస్సు వర్షం పడడటంతో తిరుగు ప్రయాణంలో బురదలో చిక్కుకుని గ్రామస్తుల సహాయంతో బయటకు వచ్చింది. కనీసం పక్కా రోడ్డు లేని ఈ అటవీ గ్రామానికి తొలిసారి బస్సు రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



ఓల గ్రామంలో మసీదు వద్ద నిర్మించిన సామూహిక ఇంకుడుగుంత

ఇంకుడుగుంతలకు కొత్తరూపు



- గ్రామాల్లో సామూహిక నిర్మాణాలకు శ్రీకారం
- ప్రతీ గ్రామంలో నిర్మించుకునేలా ఆదేశాలు
- ఇంకుడుగుంత నిర్మాణానికి రూ.12వేలు



లోకేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో..

లోకేశ్వరం: పల్లె ప్రగతిలో గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. గ్రామానికో ట్రాక్టర్ కొనుగోలు చేశారు. దీంతో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. గతంతో పోల్చితే పల్లెల్లో పారిశుధ్యం మెరుగుపడింది. నిత్యం చెత్తను సేకరించడం, మురుగు కాలువల్లో పూడిక తొలగించడం, మురుగు కాలువల్లో పూడిక తొలగించడం, రహదారులకు ఇరువైపులా చెట్లను పెంచడంతో వీధులు, గ్రామాల్లోని రోడ్లు అందంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పారిశుధ్యం మరింత మెరుగు పర్చడం, మురుగు సమస్యను నివారించడం, భూగర్భజలాలను పెంచే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టింది.

దుర్వాసన దూరం...

గతంలో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు పల్లెల్లో రోడ్లపై పారుతుండేది. మురుగు నీటిగుంతగా మారి దుర్వాసన వెదజల్లేది. దోమలకు ఆవాసంగా మారి రాకపోలకు ప్రజలు ఇబ్బంది పడేవారు. దీనిని నివారించేందుకు రహదారులకు ఇరువైపులా మురుగు కాల్వలు నిర్మించారు. అలా వెళ్లిన మురుగు నీటిలో పందులు, ఈగలు, దోమలు చేరి దుర్గంధం వెదజల్లేది. ఈ సమస్యను నివారించేందుకు ప్రభుత్వం ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకు ఉపాధి హామీ పథకం కింద సహాయం చేస్తోంది.

ఇంకుడుగుంత నిర్మాణాలు వేగవంతం...

జిల్లాలోని అన్ని గ్రామాల్లో మొదట ఒక మురుగు కాల్వ చివర తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అదేశాలు ప్రభుత్వం జారీ చేసింది. వాటి నిర్వహణ, ఫలితాలను బట్టి తర్వాత అన్ని గ్రామాల్లో ఇదే పద్ధతి పాటించాలని తెలిపారు. ఒక్కొక్క సామూహిక ఇంకుడు గుంతకు దాదాపు రూ.12వేలు, ఇంటి వద్ద నిర్మించుకునే ఇంకుడు గుంతకు రూ.6వేలతో ఉపాధి హామీ నిధులతో ఖర్చు చేసి నిర్మిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని పల్లెల్లో అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే పలు గ్రామాల్లో గుంత నిర్మాణానికి భూమిపూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు.

ఇంకుడు గుంత బాగుంది



గతంలో ఇంకుడు గుంతను నిర్మించుకున్నాం. మా కుటుంబం వాడే నీరు మొత్తం ఇంకుడు గుంతకు మళ్లించాం. వాడిన నీరు మొత్తం ఇంకుడుగుంతలోనే ఇంకిపోతున్నాయి. మా బోరుకు నీరు కూడా బాగానే వస్తుంది.

– చిన్నయ్య, బాగాపూర్

పనులు ప్రారంభించాం



ప్రభుత్వ ఆదేశాలతో మురుగు కాల్వల చివరి ఇంకుడు గుంతల నిర్మాణ పనులు ప్రారంభించాం. జిల్లాలోని అన్ని మండలాల్లో ఇంకుడు గంతలను తవ్వుతున్నారు. వాటికి సంబంధించిన బిల్లులను వెంటనే అందిస్తాం. దీనికి సంబంధించిన నమూనా కూడా ఏపీవోలకు, సర్పంచులకు పంపించాం.

– విజయలక్ష్మి, నిర్మల్ డీఆర్డీవో

అధ్యాపకుడి ఉదారత

- సొంత డబ్బులతో పేద విద్యార్థులకు ఉచిత హాస్టల్ సౌకర్యం



విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధ్యాపకుడు సుభాశ్

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకోవాలనే ఆసక్తి ఉన్న 10మంది నిరుపేద గిరిజన విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు గాడ్పాలే సుభాష్ ఆధ్వర్యంలో ఉచితంగా హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. పెంబి మండలంలోని గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు పదో తరగతి పాసై చదువుకునే స్థోమత లేక ఇంటి వద్దనే ఉంటున్నారు. విషయం తెలుసుకున్న సుభాష్ గ్రామానికి వెళ్లి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చదువును మధ్యలోనే నిలిపివేయవద్దని, ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల్లో స్థిరపడాలని, ఇంటర్ చదువుకునేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉచిత బోధనతో పాటు పాఠ్య పుస్తకాలు, ఉపకార వేతనాలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. తన సొంత డబ్బులతో హాస్టల్‌లో ఉచిత వసతి కల్పిస్తానని హామీ ఇవ్వడంతో వారు అంగీకరించారు. అధ్యాపకుడి సహకారానికి పలువురు అభినందిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



బడిబాటలో పాల్గొన్న హెచ్ఎం నర్సయ్య

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని సత్తనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జి.నర్సయ్య అన్నారు. ఆదివారం గ్రామంలో బడిబాటలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో భాగంగా మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలలో గదుల కొరత తీర్చడంతో పాటు పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు.

గాలివాన బీభత్సం



పెంబి: దెబ్బతిన్న ఇంటి వద్ద బాధితులు



కుంటాల: తడిసిన ధాన్యం

కుంటాల: మండలంలోని వెంకూర్, కుంటాల, ఓలా, అంబకంటి, లింబా(కే) తదితర గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6గంటల వరకు బలమైన ఈదురు గాలులు వీచాయి. దీంతో రైతులు వర్షం కురుస్తుందోనేమోనన్న బెంగతో కల్లాల వద్ద ఉన్న ధాన్యంపై టార్పాలిన్‌లను కప్పి ఉంచారు. కాగా కల్లూర్‌లో మోస్తారు వర్షం కురవడంతో ధాన్యం తడిసింది.

పెంబి: మండలంలో గాలివాన బీభత్సం సృష్టించడంతో పెంబితాండ గ్రామంలో దాదాపుగా 15 ఇళ్లపై రేకులు లేచిపోయాయి. రేకులు కొట్టుకుపోవడంతో అక్కడే ఉన్న ఎద్దుకు తీవ్రగాయాలయ్యాయి. చెట్లు విరిగిపడటంతో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో పాటు విద్యుత్ వైర్లు తెగి విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకొంది. గాలి బీభత్సానికి రేకులు కొట్టుకుపోయిన ఇళ్లను పరిశీలించి నష్ట పరిహారం అందించాలని వారు కోరుతున్నారు.

కడెం: ఈదురుగాలులతో కూడిన వర్షం మండలంలోని అల్లంపల్లి ఉమ్మడి గ్రామ పంచాయతీలో బీభత్సం సృష్టించింది. ఆదివారం మధ్యాహ్నం ఈదురుగాలులతో వర్షం రావడంతో అకుల వజ్రవ్వ, యాళ్ల చుక్కరెడ్డి, నాయిడి మల్లేష్, చవన్ నూర్సింగ్, బోడ గుణవంత్‌రావుల ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పది విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో అల్లంపల్లి, బాబానాయక్‌తండా గ్రామ పంచాయతీల పరిధిలోని మీసాలభూమన్నగూడేం, పాలరేగడి, గంగన్నపేట్, చింతగూడేం, అద్దాల తిమ్మాపూర్ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

గోదావరికి మొక్కి.. చిల్లర నాణేలు వేసి



తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం కేసీఆర్

నిర్మల్‌చైన్‌గేట్: నాలుగేళ్ల తర్వాత ఆదివారం నిర్మల్ జిల్లాకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు ఘనస్వాగతం లభించింది. వాతావరణం అనుకూలించక రోడ్డు మార్గాన వచ్చిన ఆయన మధ్యలో సోన్ బ్రిడ్జి వద్ద కాసేపు ఆగారు. గోదావరమ్మకు నమస్కరించి చిల్లర నాణేలను నదిలో వేశారు.

సభ సైడ్‌లైట్స్..

- సీఎం కేసీఆర్ మధ్యాహ్నం 3:15 నిమిషాలకు హెలికాప్టర్‌లో రావాల్సి ఉండగా, వాతావరణం అనుకూలించక మధ్యాహ్నం 1:40గంటలకు కాన్వాయ్ ద్వారా ప్రగతి భవన్ నుంచి నిర్మల్‌కు బయలుదేరారు.
- నేరుగా 4:20గంటలకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు.
- నిర్మల్‌లోని కొండాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని సందర్శించి 4:30గంటలకు తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొని పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.
- జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని చైర్‌లో కూర్చోబెట్టి ఆశీర్వదించి, అభినందనలు తెలిపారు.
- ఉత్తమ గ్రామ పంచాయతీగా రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం, ముఖరా(కే) గ్రామ సర్పంచ్ గాడ్గే మినాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్‌లను అభినందించారు.
- నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభించి కలెక్టర్ వరుణ్‌రెడ్డిని చైర్‌లో కూర్చోబెట్టి ఆశీర్వదించి, అభినందనలు తెలిపారు.
- మధ్యాహ్నం 3గంటల నుంచి జనాలు వివిధ నియోజకవర్గాల నుంచి సభాస్థలికి చేరుకున్నారు.
- సాయంత్రం 5:30 గంటల నుంచి వర్షం ప్రారంభమైంది. దాదాపు 20 నిమిషాలపాటు సభాస్థలిలో వర్షం కురిసింది. దీంతో సభకు హాజరైన కార్యకర్తలు వర్షానికి తడవకుండా కుర్చీలు అడ్డు పెట్టుకున్నారు.
- 6:19 గంటలకు సీఎం సభాస్థలికి చేరుకున్నారు.
- 6:20 గంటలకు రాష్ట్ర మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి అధ్యక్ష ఉపన్యాసం చేశారు.
- 6:23 గంటలకు సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని ప్రారంభించారు. దాదాపు 24 నిమిషాలు ప్రసంగాన్ని కొనసాగించి 6:40 నిమిషాలకు ముగించారు.
- 6:25 గంటలకు రోడ్డు మార్గాన హైదరాబాద్‌కు పయనమయ్యారు.

సీఎం సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



ఖానాపూర్: నాయకులతో ఎమ్మెల్యే రేఖానాయక్



కుంటాల: తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



తానూర్: సభకు వెళ్తున్న నాయకులు

తానూరు: నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు తానూరు మండలంలోని ఆయా గ్రామాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు తరలివెళ్లారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు వెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతారెడ్డి, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, కోఆప్షన్ సభ్యుడు గోవింద్‌రావ్ పటేల్, నాయకులు చంద్రకాంత్ ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల నుంచి సీఎం కేసీఆర్ సభకు పెద్ద ఎత్తున నాయకులు వెళ్లారు. ఇందులో మహిళలు, నాయకులు ఉన్నారు.

కుంటాల: బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాత్రి ఆధ్వర్యంలో మండలంతో పాటు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని పార్టీ కార్యకర్తలు తరలివెళ్లారు. జెడ్పీటీసీ గంగామణి బుచ్చన్న, సర్పంచ్‌లు కనీష్‌ఫాతిమ, మల్లేష్, నాయకులు రమణాగౌడ్, జుట్టు మహేందర్, రజినీకాంత్, డాక్టర్ భోజన్న, హైమ్మద్‌పాషా, మల్లేష్‌గౌడ్ ఉన్నారు.

భైంసాటౌన్: పట్టణాధ్యక్షులు ఫారూక్ అహ్మద్, సీనియర్ నాయకులు మురళీగౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

భైంసారూరల్: మండలంలోని పలు గ్రామాల నుంచి కార్యకర్తలు ప్రత్యేక వాహనాలు తరలివెళ్లారు.

ఖానాపూర్: మండలం నుంచి ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌తో పాటు బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు, మంత్రి కేటీఆర్ మిత్రుడు జాన్సన్ నాయక్‌ల ఆధ్వర్యంలో వేర్వేరుగా తరలివెళ్లారు.

దస్తురాబాద్: మండలం నుంచి ఎంపీపీ సింగరి కిషన్, జెడ్పీటీసీ శారధ, వైస్ ఎంపీపీ రాజునాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఐలయ్య యాదవ్, రాజ నర్సయ్య ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ, ధర్మోర, పంచగుడి, వట్టోలి, మన్మద్, లోకేశ్వరం తదిరత గ్రామాల నుంచి సీఎం కేసీఆర్ సభకు బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు.

ప్రతిపక్ష నాయకుల ముందస్తు అరెస్టు

నిర్మల్ జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బీజేపీ నాయకులను శనివారం రాత్రి నుంచి అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు.



దస్తురాబాద్: పోలీస్‌స్టేషన్‌లో సీపీఎం నాయకులు

ఖానాపూర్: మండలంలో బీజేపీ, కాంగ్రెస్, వైఎస్సార్ టీపీ, సీపీఐఎంఎల్,, సీపీఎం, ఎంసీపీఐ తదితర పార్టీల నేతలు అరెస్టయ్యారు.

గృహ నిర్బంధం

భైంసాటౌన్: బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవిని, నియోజకవర్గ నాయకులు పవార్ రామారావు పటేల్, భోస్లే మోహన్‌రావుపటేల్‌లను గృహ నిర్బంధం చేశారు. అలాగే జనసేన నాయకులు సుంకెట మహేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్‌రావు పటేల్, వివిధ ప్రజాసంఘాల నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు.

తానూరులో...

తానూరు: మండలంలో అరెస్ట్ అయిన వారిలో బీజేపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, సోమ్‌నాథ్, గణేశ్ ఉన్నారు.

సారంగపూర్‌లో...

సారంగపూర్: మండల బీజేపీ నాయకులను ఆదివారం తెల్లవారు జామున పోలీసులు అరెస్ట్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందులో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కరిపె విలాస్, నాయకులు సామల వీరయ్య, బడిపోత్న, ప్రకాష్, వెంకటేష్, నిఖిల్, తేజు ఉన్నారు.

లక్ష్మణచాందలో...

లక్ష్మణచాంద: పీచర ఎంపీటీసీ రాజశ్వర్, బీజేపీ మండల అధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు అనిల్, రవికుమార్, గంగాధర్, కంకల్ల రవి ఉన్నారు.

ముథోల్‌లో...

ముథోల్: మండలంలోని ఆయా గ్రామాల్లోని బీజేపీ నాయకులను ఉదయాన్నే అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులు సరికాదని నాయకులు పేర్కొన్నారు.

సీపీఎం నాయకులు..

దస్తురాబాద్: సీఎం సభ సందర్భంగా ముందస్తుగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, డాకూరి తిరుపతిలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అపురూపం.. ఆత్మీయ సమ్మేళనం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఉపాధి, ఉద్యోగం, వ్యాపార రీ త్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డవారంతా 32 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుని రోజంతా సరదాగా గడిపారు. పాఠశాలలో బోధించిన గురువులను ఆహ్వానించి సన్మానించా రు. అప్పటి ఉపాధ్యాయులు రఘోత్తమ్‌రెడ్డి, నిర్మల, లక్ష్మణ్, రమణయ్యస్వామి, మోహన్‌రావు, గంగన్న తదితరులు పాల్గొన్నారు.





మార్కెట్‌లో ట్రాఫిక్ తిప్పలు

జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్లో లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన షెడ్లు నిర్మించారు. షెడ్లలో కూరగాయలు అమ్ముకోకుండా రోడ్డుపైనే అమ్మడంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. కూరగాయలు అమ్ముకునే వారికి కేటాయించిన షెడ్లను వదిలి రోడ్డుపై కూరగాయలు అమ్మడంతో షెడ్లు నిరుపయోగంగా మారాయి. మరికొందరు రోడ్లపై తోపుడుబండ్లు పెట్టుకొని కూరగాయలు, పండ్లు విక్రయించడంతో ఉదయం భారీగా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కూరగాయల మార్కెట్‌కు వచ్చే కొనుగోలుదారులు వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేయడం, కూరగాయలు రోడ్డుపైనే విక్రయాలు చేయడంతో నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదని పాదచారులు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు మాత్రం చర్యలు చేపట్టకపోవడంతో నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్